సాక్షి మెదక్

గురువారం। 17। ఏప్రిల్। 2025



మొగులు.. గుబులు

ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్న వేళ రైతుల గుండెల్లో గుబులు పుడుతుంది.

వివరాలు 8లో ▸



ఉచిత కరెంట్‌తో బట్టీలు

రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కరెంట్ అక్రమ ఇటుకల వ్యాపారులకు వరంగా మారింది.

వివరాలు 8లో ▸



లక్ష్యం ఘనం..

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి దుకాణాలను అద్దెకిచ్చినా.. వసూలు చేయడంలో అశ్రద్ధ చూపుతున్నారు.

వివరాలు 9లో ▸

యూనిఫామ్‌లో మార్పులు

- ఎంఈఓల పర్యవేక్షణలో పనులు
- మహిళా సంఘాల సభ్యులకు కుట్టే బాధ్యత
- బడిబాటకు ముందే పాఠశాలలకు చేరేలా ప్రణాళిక

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న యూనిఫామ్‌లో మార్పులు చేశారు. 6 నుంచి 12 తరగతి వరకు బాలబాలికలకు ఒకే విధంగా ఉండేలా మార్పు చేయనున్నారు. ముఖ్యంగా ఎదిగే బాలికలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా తయారు చేయనున్నారు. గతంలో విద్యా సంవత్సరం సగం ముగిసే వరకు యూనిఫామ్‌లు కుట్టుడం కొనసాగేది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఈసారి మాత్రం విద్యా సంవత్సరం ప్రారంభంలోగానే యూనిఫామ్‌లు అందేలా పక్కాగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

పరిశీలన బాధ్యతలు ఎంఈఓలకు..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే యూనిఫామ్‌ల క్లాత్ తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ (టెస్కో) సరఫరా అందిస్తుంది. జిల్లాకు చేరిన యూనిఫామ్‌ల క్లాత్‌ను పరిశీలించి, భద్రపర్చే బాధ్యతలను సంబంధిత ఎంఈవోలకు అప్పగించారు. ప్రస్తుతం ఒక జతకు సంబంధించిన క్లాత్ మాత్రమే వచ్చింది. వాటిని స్వయం సహాయక సంఘాల సభ్యులతో కుట్టించేలా కార్యాచరణ రూపొందించారు. ఎంఈఓల పర్యవేక్షణలో డీఆర్‌డీఏ, అర్బన్, మెప్మా, టీఎల్‌ఎఫ్ మహిళా సంఘాల సభ్యులకు క్లాత్ అందజేశారు. ఒక్కో జత కుట్టడానికి రూ.75 చొప్పున చెల్లించనున్నారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.



జిల్లాకు చేరిన యూనిఫాంల క్లాత్



ప్రభుత్వం విడుదల చేసిన కొత్త యూనిఫామ్‌ల డిజైన్లు

యూనిఫామ్‌లో చేసిన మార్పులు

ఈ విద్యాసంవత్సరంలో అందించే యూనిఫామ్‌లలో స్వల్ప మార్పులు చేశారు. చొక్కాలు, లాంగ్ గౌన్‌లకు పట్టీలు, భుజాలపై కప్స్ వంటివి లేకుండా సాధారణ యూనిఫామ్‌గా డిజైన్ చేశారు. బాలురకు ఆరు నుంచి 12 తరగతి వరకు నిక్కర్లు కాకుండా ప్యాంట్లు అందించాలని నిర్ణయించారు. ప్రస్తుతానికి నెక్కర్లకు మాత్రమే వస్త్రం జిల్లాకు చేరింది.

జిల్లాలో 932 పాఠశాలలు

జిల్లాలో ప్రభుత్వ, యూపీఎస్, పీఎస్, కేజీబీవీ, జెడ్పీ, ఎయిడెడ్, యూఆర్‌ఎస్, టీఎస్‌ఆర్‌ఈఐఎస్, మోడల్ స్కూళ్లు మొత్తం 932 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో బాలికలు 37,742 మంది, బాలురు 36,523 మంది ఉన్నారు. స్కూళ్లలో 1 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించనున్నారు.

బడిబాటకు ముందే..

మే నెలాఖరులోగా యూనిఫామ్‌లు పూర్తి చేసి బడిబాటకు ముందే పాఠశాలలకు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటి వరకు జిల్లాకు చేరిన యూనిఫామ్ క్లాత్‌ను ఎంఈఓల పర్యవేక్షణలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల సమన్వయంతో స్వయం సహాయక సంఘాల సభ్యులతో కుట్టించడం జరుగుతుంది. కొత్త దుస్తుల్లో పిల్లలు విద్యాసంవత్సరం ప్రారంభానికి తరగతులకు హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించాం.

– రాధాకిషన్, డీఈఓ, మెదక్

న్యూస్‌రీల్

24న టాలెంట్ టెస్టు

నర్సాపూర్: పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్టు ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టును ఈనెల 24న నిర్వహిస్తున్నారని టీఎస్ యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు రవి, గంగాధర్ తెలిపారు. వారు మాట్లాడుతూ.. నాలుగు నుంచి ఆరవ తరగతులు చదువుతున్న విద్యార్థులు టాలెంట్ టెస్టు రాసేందుకు అర్హులని చెప్పారు. అనాథ పిల్లలు, తల్లి, తండ్రి లేని పిల్లలు ఉన్నత విద్యకు దూరం కావొద్దన్న ఉద్దేశ్యంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత విద్య అవకాశం కల్పిస్తున్నారన్నారు. టెస్టులో ఎంపికై న వారికి ఉచిత విద్య అందిస్తారని, ఈనెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99496 02664, 79897 30251 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

మనోహరాబాద్(తూప్రాన్): భూభారతి రెవెన్యూ చట్టంపై కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం మనోహరాబాద్ మండలం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతిపై ఆర్డీఓ జయచంద్రారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో మనోహరాబాద్ రైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు పాల్గొని తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

అసత్య ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న చౌకబియ్యంపై అసత్య ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సురేష్‌రెడ్డి హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో చౌక దుకాణాలు ద్వారా ప్లాస్టిక్ బియ్యం ఇస్తున్నారని జరుగుతున్న దుష్ప్రచారంపై ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. అలాంటి ప్రచారాలు ప్రజలు నమ్మొద్దని ఆయన సూచించారు.

టీకాలతో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య



శీలాంపల్లిలో గాలికుంటు టీకా ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): ముందస్తు జాగ్రత్తగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం వల్ల పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, పశువులు ఆరోగ్యంగా ఉంటాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటయ్య అన్నారు. బుధవారం ఆయన మండలంలోని శీలాంపల్లి, చిట్కుల్ గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన శీలాంపల్లిలో రైతులు సాగు చేస్తున్న (సూపర్ నేపియర్) గడ్డిని పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రతీ పశువుకు టీకా ఇప్పించాలన్నారు. సూపర్ నేపియర్ గడ్డితో పశువులకు కలిగే లాభాలు వివరించారు. కార్యక్రమంలో వెటర్నరీ సర్జన్ డాక్టర్ వినోద్, పశువైద్య సిబ్బంది గట్టయ్య, శంకర్, సతీష్, రైతులు పాల్గొన్నారు.

కొత్త ఒప్పందాలతో ఉద్యోగావకాశాలు

బీవీ రాజు ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు



ఇంజనీరింగ్ కళాశాలతో ఒప్పందం చేసుకుంటున్న ప్రతినిధులు

నర్సాపూర్: కొత్త సంస్థ ఒప్పందాలతో విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి, నైపుణ్యాలు పెంపొందించుకునే అవకాశాలు పెరుగుతాయని బీవీ రాజు ఇంజనీరింగ్ కళాశాల ట్రెనింగ్ ప్లేస్‌మెంటు ఆఫీసర్ బంగ్రరాజు, ఈసీఈ హెక్షడీ సంజీవరెడ్డి చెప్పారు. బుధవారం తమ కళాశాలతో క్యూఎస్‌ఎక్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుందని చెప్పారు. విద్యార్థులకు ప్రాజెక్టులపై శిక్షణ, ఇంటర్న్‌షిప్, మెడికల్‌కు సంబంధించిన ప్రాజెక్టు కంటెస్టుల్లో పాల్గొనే అవకాశం ఉందని వారు చెప్పారు.

అనాథ పిల్లలకు అండగా ఉంటాం



కుర్తివాడలో అనాథల వివరాలు సేకరిస్తున్న డీడబ్ల్యూఓ, సీడీపీఓ, సూపర్‌వైజర్లు

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలం కుర్తివాడలో అనాథలుగా ఉన్న పిల్లలకు అండగా ఉంటామని డీడబ్ల్యుఓ హైమావతి, డీసీపీఓ కరుణశీల అన్నారు. బుధవారం వారు బాధితుల పూరిగుడిసెను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కుర్తివాడకు చెందిన భూతిపురం రవి గతంలో ప్రమాదవశాత్తు మరణించాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కొడుకు సంతానం. వారిని పోషించడం భారంగా మారడంతో తల్లి సంపూర్ణ పిల్లలను వదిలేసి వెళ్లింది. దీంతో దూరపు బంధువులు ఇద్దరు ఆడపిల్లలను, అబ్బాయిని వసతి గృహాల్లో చేర్పించి చదివిస్తున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు వస్తుండటంతో వసతి గృహాలు మూతపడనున్నాయి. ఇంటికి వచ్చి ఉందామంటే పూరి గుడిసెలో ఉండలేని పరిస్థితి.ఈ విషయం తెలుసుకున్న డీడబ్ల్యుఓ హైమావతి, డీసీపీఓ కరుణశీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వివరాలు సేకరించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

చిలప్‌చెడ్ (నర్సాపూర్): రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు జరపాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం చిలప్‌చెడ్ మండలంలోని ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం మండల బీఆర్‌ఎస్ నాయకులతో కలసి చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు నష్టపోకుండా త్వరితగతిన కొనుగోళ్లు ప్రారంభించి, మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. గన్నీబస్తాలు, రవాణా, లారీల కొరత తదితర సమస్యలు రాకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సన్నాలకు రూ.5 వందల బోనస్ జమ చేయాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

27న వరంగల్‌లో జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్, సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, వైస్‌చైర్మన్ రాంచంద్రారెడ్డి, యూత్ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రావొద్దు

వెల్దుర్తి: కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించి అన్నదాతలు ఇబ్బందులు పడకుండా చూడాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం వెల్దుర్తి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో కొనుగోలు ప్రక్రియలో జరిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ యేడు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణాగౌడ్, మాజీ జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.కాగా, ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

చలో వరంగల్‌ను విజయంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): బీఆర్‌ఎస్ రజతోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న చలో వరంగల్ సభను విజయంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కోరారు. మండల కేంద్రమైన టేక్మాల్‌లో బుధవారం రజతోత్సవాల వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు గడుస్తున్న ప్రస్తుత తరుణంలో రజతోత్సవాలను నిర్వహించేందుకు పార్టీ వరంగల్ సభను పెద్ద ఎత్తున నిర్వహించడానికి సంకల్పించిందని తెలిపారు. ఈ నెల 27న జరిగే చలో వరంగల్ కార్యక్రమానికి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప, నాయకులు సిద్దయ్య, రవి, రజాక్, సాయిబాబా, మల్లేశం, సలావుద్దీన్, సాయిలు, సంగయ్య, బాలకృష్ణ, నారాగౌడ్, తదితరులు ఉన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి

జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల అధికారులతో పెండింగ్ కేసులపై నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ సైబర్ క్రైమ్, డయల్ 100 వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

బీఆర్‌ఎస్ హయాంలో విద్య, వైద్యంపై నిర్లక్ష్యం

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



రామాయంపేట: అంగన్‌వాడీ చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్

రామాయంపేట(మెదక్)/చిన్నశంకరంపేట/పాపన్నపేట: బీఆర్‌ఎస్ హయాంలో విద్య, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేశారని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ విమర్శించారు. బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నశంకరంపేట, గవ్వలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, అలాగే.. పాపన్నపేట మండలం పొడిచన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం, మత్స్య సహకార భవనాన్ని ప్రారంభించారు. మెదక్‌లో మెడికల్ కళాశాలతో పాటు రామాయంపేటకు రూ.200 కోట్లతో ప్రతిష్టాత్మక ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయించానన్నారు. అనంతరం అంగన్‌వాడీ పిల్లలకు పోషణ పక్షం క్యాలెండర్‌తో పాటు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

దళారులను నమ్మొద్దు

ధాన్యం కొనుగోలు విషయంలో దళారులను నమ్మొద్దని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అనంతరం కొత్తపల్లిలో ఇటీవల మరణించిన త్యార్ల సుజాత సంస్మరణ సమావేశంలో పాల్గొని నివాళులు అర్పించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

యువ వికాసం సద్వినియోగం చేసుకోవాలి

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య



చిన్నశంకరంపేట ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఈఓ ఎల్లయ్య

చిన్నశంకరంపేట(మెదక్)/వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి కోసం చేయూత అందించేందుకు తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం యువత సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య కోరారు. బుధవారం చిన్నశంకరంపేట, మాసాయిపేట మండల పరిషత్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు చేసిన ప్రతీ ఒక్కరూ హార్డ్ కాపీని తీసుకొచ్చి ఎంపీడీఓ కార్యాలయంలో అందించాలన్నారు. ఎంపీడీఓ కార్యాలయ రికార్డులు, ఈజీఎస్ సోషల్ ఆడిట్ రికార్డులు పరిశీలించి, ఉపాధిహామీ పనులపై ఆరా తీశారు.

నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య ఆదేశించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు, తాగునీటి సమస్యలపై పలు సలహాలు, సూచనలు అందజేశారు. నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ విఘ్నేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితా పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల జాబితాను జెడ్పీ సీఈఓ ఎల్లయ్య బుధవారం పరిశీలించారు. చేగుంట ఎంపీడీఓ కార్యాలయం సందర్శించిన జెడ్పీ సీఈఓ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాతో పాటు ఉపాధి కూలీల సామాజిక తనిఖీ రిపోర్టును పరిశీలించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు యాక్షన్ ప్లాన్ ప్రకారం పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చిన్నారెడ్డికి సూచించారు. ఈ పరిశీలనలో ఉపాధి హామీ ఏపీఓ స్వేత, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

20 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

- 5 నిమిషాలు ఆలస్యమైతే నో ఎంట్రీ
- అభ్యర్థులకు గుర్తింపు కార్డు తప్పనిసరి
- డీఈఓ రాధాకిషన్

మెదక్ కలెక్టరేట్: ఈనెల 20 నుంచి మే 26వ తేదీ వరకు జిల్లాలో ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు డీఈఓ రాధాకిషన్ తెలిపారు. బుధవారం పరీక్షల కోసం సంబంధిత అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పది పరీక్షలకు 459 మంది, ఇంటర్‌లో 876 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఏదైనా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 9 నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

పదికి 3..ఇంటర్‌కు 5 కేంద్రాలు

జిల్లాలో జరిగే పదో తరగతి పరీక్షలకు మెదక్, నర్సాపూర్, తూప్రాన్‌లలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షల కోసం మెదక్(2), నర్సాపూర్(2), తూప్రాన్(1) చొప్పున మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా కనీస వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

క్రిమినల్ కేసులు

పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా వారిపై చట్టం 25/1997 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఈఓ హెచ్చరించారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఒక సిట్టింగ్ స్క్వాడ్, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్స్, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు ఉంటారని తెలిపారు.

ఆలస్యమైతే నో ఎంట్రీ

పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఐదు నిమిషాలకు మించి ఆలస్యమైతే పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి 30 నిమిషాల ముందు కేంద్రంలోని చేరుకోవాలన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఇంటిగ్రేటెడ్ బాలిక హాస్టల్ సందర్శన
- విద్యార్థినులతో మాట్లాడి సమస్యలపై ఆరా



అస్వస్థతకు గురైన విద్యార్థినుల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం కౌడిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌ను కలెక్టర్ సందర్శించారు. ఫుడ్ పాయిజన్‌తో 30మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విషయం విదితమే. దీంతో కలెక్టర్ సందర్శించి హాస్టల్‌లో గదులు, కిచెన్, బాత్‌రూంలతోపాటు సరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా నాకు ఫోన్ చేయండి, తక్షణమే చర్యలు తీసుకుంటానని కలెక్టర్ భరోసా కల్పించి తన ఫోన్ నంబర్‌ను ఇచ్చారు. అస్వస్థతకుగురైన వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్యసేవలపై వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్‌లో పరిశుభ్రతను పాటిస్తూ రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. విద్యార్థులకు అస్వస్థతకు గురికావడంపై విచారణ జరుగుతోందన్నారు. అస్వస్థతకు గురైన వారందరూ ప్రస్తుతం బాగున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ పద్మజ, వార్డన్ నర్సమ్మ, డాక్టర్ ఫెర్నాజ్, సీహెచ్‌ఓ ఎలిజబెత్‌రాణి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైనా దాడిలో గొర్రెలు మృత్యువాత


మృత్యువాత పడిన గొర్రెలు

మద్దూరు(హుస్నాబాద్‌): హైనా దాడిలో గొర్రెలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని రేబర్తి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఈరి శ్రీనివాస్‌ తన వ్యవసాయ బావి వద్ద షెడ్డు నిర్మించుకొని గొర్రెల పెంపకం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గొర్రెలను షెడ్డులోకి తోలి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం షెడ్డు వద్దకు వెళ్లి చూడగా హైనా దాడిలో ఏడు గొర్రెలు మృతి చెంది కనిపించాయి. మరో మూడు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. సుమారు రూ.లక్ష వరకు నష్ట వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

తండ్రిపై హత్యాయత్నం

- కుమారుడు రిమాండ్‌

నర్సాపూర్‌ : తండ్రిపై హత్యాయత్నం చేసిన కుమారుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు. మండలంలోని చిన్నచింతకుంటకు చెందిన వడ్ల నాగరాజు తన తండ్రి దశరథను ఎలాగైనా చంపాలన్న ఉద్దేశ్యంతో 12న నర్సాపూర్‌లో కత్తి కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి తండ్రితో గొడవ పడి కత్తితో దాడి చేశాడు. ఆస్తి పంచడం లేదని, తనకు మరో పెళ్లి చేయడం లేదన్న నెపంతో కత్తితో తండ్రిపై దాడి చేశాడని పేర్కొన్నారు. బుధవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

దాడి కేసులో ఇద్దరు అరెస్ట్‌

నంగునూరు(సిద్దిపేట): రెండు వేర్వేరు చోట్ల దాడికి పాల్పడిన ఘటనలో ఇద్దరిని బుధవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించనట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ అసీఫ్‌ తెలిపారు. నర్మేటకు చెందిన సాయికుమార్‌ మంగళవారం పుట్టిన రోజు జరుపుకుంటుండగా అదే గ్రామానికి చెందిన రాజశేఖర్‌ మద్యం తాగించాలని కోరాడు. డబ్బులు లేవని చెప్పడంతో దాడి చేయగా సాయికుమార్‌కు గాయాలయ్యాయి. అలాగే, మంగళవారం హుస్నాబాద్‌లో జరిగిన పెళ్లి వేడుకల్లో జరిగిన గొడవ విషయమై మాట్లాడుతుండగా నంగునూరుకు చెందిన జిడ్డి రజినీకాంత్‌, సంపత్‌లపై ముండ్రాయికి చెందిన జున్నుబోయిన అనిల్‌ దాడి చేశాడు. రెండు ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరిని బుధవారం రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

అంబేడ్కర్‌ను రాజకీయాలతో ముడిపెట్టొద్దు

- ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ రాష్ట్ర చైర్మన్‌ బక్కి వెంకటయ్య



దుబ్బాక : భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను స్వార్థ రాజకీయాలకు ముడి పెట్టడడం బాధాకరమని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ రాష్ట్ర చైర్మన్‌ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 13న దౌల్తాబాద్‌ మండలం ముబారస్‌పూర్‌లో అంబేడ్కర్‌ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమాన్ని రాజకీయాలకు ముడి పెట్టడడం తగదన్నారు. ముబారస్‌పూర్‌లో జరిగిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నాతోపాటు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, డీబీఎఫ్‌ జాతీయ నాయకులు శంకర్‌ అక్కడే ఉన్నామని కింద ఉన్న వ్యక్తి జెండా కావాలని అడుగడంతో ఎమ్మెల్యేపై నుంచి జెండాను ఆ వ్యక్తికి వేశాడని అన్నారు. అనవసరంగా దీనిపై రాజకీయాలు చేయడం మంచి పరిణామం కాదన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి జెండాను కింద పడేస్తే మేమే ఖండించేవారిమని దీనిపై సోషల్‌ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.

తల్లీకొడుకులమృతిపై కేసు నమోదు

కల్హేర్‌(నారాయణఖేడ్‌): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి తల్లీకొడుకులు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కల్హేర్‌ ఎస్‌ఐ వెంకటేశం బుధవారం తెలిపారు. నిజాంపేట మండలం బాచేపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రేగోడ్‌ మండలం పట్టిపోలం తండాకు చెందిన తల్లీకొడుకులు లావుడ్య సక్రిబాయి, సుభాష్‌ దుర్మరణం చెందారు. మృతురాలు సక్రిబాయి కుమారుడు రమేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రమాదానికి గల వాహనాన్ని గుర్తించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

మొగులు.. గుబులు

రైతులను భయపెడుతున్న మబ్బులు



ఈ ఫొటోలో కనిపిస్తుంది దుబ్బాకకు చెందిన కౌలు రైతు మల్లా రెడ్డి. యాసంగిలో వేసిన 3 ఎకరాల వరి పంట ఇంకో 15 రోజులైతే కోతకొచ్చేది. ఆకాశంలో మబ్బులు అవుతుండటంతో భయంతో వరి గొలుసు ఎర్రబడక ముందే కోయించాడు. వర్షం పడితే ఇత్తు చేతికి రాదు ఉన్న పంటనన్నా చేతికొస్తే చాలనుకొని పచ్చిగా ఉన్నా వరిని కోశాడు. ఇది ఈ ఒక్క రైతు మల్లారెడ్డిదే పరిస్థితే కాదు.. జిల్లాలోని చాలా మంది రైతులది ఇదే పరిస్థితి. మొగులు గుబులుతో నష్టం అయినా సరే పంటనన్నా కాపాడుకోవాలనే పచ్చి వరిని కోయిస్తున్నారు.



- వర్షం పడితే వరి పంట ఆగమాగమే
- నష్టమని తెలిసినా.. ముందే కోయిస్తున్న వైనం
- ఉన్న పంటనన్నా చేతికొస్తే చాలంటున్న రైతులు
- పచ్చి వరి చేను కోతతో 20 శాతంకు పైగా నష్టం
- జిల్లాలో 3.53 లక్షల ఎకరాల్లో వరి సాగు


దుబ్బాకలో పచ్చి వరిని కోయిస్తున్న రైతు

దుబ్బాక : ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్న వేళ రైతుల గుండెల్లో గుబులు పుడుతుంది. ఏ క్షణాన గాలి దుమారం వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం రెక్కలు ముక్కలు జేసుకొని.. పుట్టెడు పెట్టుబడులు పెట్టి కండ్లల్ల ఒత్తులు వేసుకొని యాసంగిలో పంటలు కాపాడుకుంటూ వస్తున్న రైతులకు వాన మొగులు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. వరి పంటలు చేతికొచ్చే దశలో వారం రోజులుగా ఆకాశంలో మబ్బులు రైతులను పరేషాన్‌ చేస్తున్నాయి. 20 రోజుల కిందట వడగండ్ల వానలు పడటంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మళ్లీ గాలి దుమారం, వడగండ్ల వానలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలతోపాటు వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు పచ్చి వరి పంట చేలనే కోస్తున్నారు.

20 శాతంకు పైగా నష్టమైనా..

వర్షాలు పడే సూచనలు ఉండడంతోపాటు వారం రోజులుగా చినుకులు కూడా పడుతుండటంతో రైతులు భయంతో 70 శాతం కూడా పూర్తి కాని వరి పంటలను కోయించుకుంటున్నారు. భూమి ఆరక దిగబడుతుండటంతో ఖర్చు ఎక్కువైనా చైన్‌ మిషన్‌లను పెట్టి కోయిస్తున్నారు. సుమారుగా 20 శాతంకు పైగా గింజలు తాలుపోయి నష్టం జరిగే అవకాశాలు ఉంది. జిల్లాలో ఈ యాసంగిలో 3.53 లక్షల ఎకరాల్లో వరి పంటలు వేయగా చాలా వరకు నీరందక పంటలు ఎండిపోయాయి. గతంలో కురిసిన వడగండ్ల వర్షంతో కొంత వరి పంటలకు నష్టం వాటిల్లింది. తీరా మళ్లీ ఆకాశంలో మార్పులతో పూర్తిగా కాని చేలనే కోస్తుండటంతో చాలా నష్టం వాటిల్లేటట్లు కనిపిస్తుంది.

10 రోజులకు కోసేదుండే..



నేను 4 ఎకరాల్లో వరి పంట వేసిన. ఇంకో 10 నుంచి 15 రోజులైతే వరి పూర్తిగా కోతకు వచ్చేది. వాన భయంతో ముందుగానే కోయించిన. కొంత పాల్లు పోయినా వాన పడితే ఇత్తు చేతికి రాదనే భయంతోనే కోయించిన. ఏం చేస్తాం బాకీ ఉన్న కాడికి అయితాయి. ఇంకా 10 రోజులు ఉంచితే చేతికొస్తదనే గ్యారంటీ లేదాయే. నేనే కాదు చాలా మంది పచ్చి చేలనే కోయిస్తుండ్రు.
– గన్నె వెంకట్రాజిరెడ్డి, రైతు దుబ్బాక

వానపడితే చేతికిరాదనే భయం..



20 రోజుల కిందటే వరి ఈనుతున్న దశలోనే వడగండ్ల వర్షం పడింది. మళ్లీ చేతికొస్తదనుకున్న సమయంలో మొగుల్లు కావట్టే. మళ్లీ రాళ్ల పడితే పంటగింజ కూడా దక్కదు. పచ్చిగా ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో కోయించిన. యాసంగిలో పంట చేతికొచ్చేది నమ్మకం లేదు. పోయిన యాసంగిలో రాళ్లవాన పడి పంట చాలా నష్టం జరిగింది. ఇప్పుడు మొగుల్లు అవుతుండటంతో 2 రోజుల కిందటనే పచ్చిచేనునే కోయించినా.
– ఎంగారి నరేశ్‌ రెడ్డి, రైతు

ఎర్రబడక ముందే కోస్తే నష్టం



వరి పంటలు పూర్తిగా ఎర్రబడక ముందే కోయడం వల్ల నష్టం వాటిల్లుతుంది. వరి గొలుసులు 85 నుంచి 90 శాతం వరకు ఎర్రబడ్డ తర్వాతనే పంటలు కోస్తే దిగుబడి మంచిగా వస్తుంది. వానల భయంతో రైతులు పూర్తిగా గొలుసు కాకముందే కోస్తుండడం వల్ల చాలా వరకు గింజలు తాలు పోయే పరిస్థితి ఉంటుంది. రైతులు పూర్తిగా గొలుసు ఎర్రబడక ముందే పంటలు కోసి నష్టపోవద్దు.
– రాధిక, జిల్లా వ్యవసాయాధికారి

అతి పెద్ద జైన విగ్రహాన్ని కాపాడాలి

పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి


విగ్రహాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి, కరుణాకర్‌, పవన్‌, తదితరులు

నంగునూరు(సిద్దిపేట): నంగునూరులోని చిన్న కొండపై వేల ఏళ్ల కింద వెలసిన వర్ధమాన మహావీరుడి విగ్రహం వద్ద క్వారీ పనులను ఆపి విగ్రహం ధ్వంసం కాకుండా చూడాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్‌ ఇండియా ఫౌండేషన్‌ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి కోరారు. సిద్దిపేట జిల్లా నంగునూరులోని జాకీరమ్మ బండపై ఉన్న జైన శిల్పం గురించి కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్‌ రామోజు హరగోపాల్‌, సభ్యులు అహోబిలం కరుణాకర్‌, సామలేటి మహేశ్‌ శివనాగిరెడ్డికి వివరించడంతో బుధవారం ఆ ప్రాంతాన్ని సందర్శించి విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం శివనాగిరెడ్డి మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు బండలను తొలుస్తున్న క్రమంలో విగ్రహం ధ్వంసం అయ్యే అవకాశం ఉందన్నారు. 9 అడుగుల జైన శిల్పం కాయోత్సర్గాసనంలో నిలబడి ఉందని, విగ్రహం తలపై ఉష్ణీష చిహ్నం రాష్ట్ర కూటుల కాలపు జైన తీర్థంకర లక్షణానికి అద్దం పడుతోందని తెలిపారు. కొండకు దిగువన ఇటుక రాతి శకలాలు, రాతి స్తంభంపై పద్మాసనం వేసుకొని కూర్చున్న మహావీరుడి శిల్పంతోపాటు గ్రామంలో హనుమాన్‌ దేవాలయ ప్రాంగణంలో జైన తీర్థంకరుల శిల్పాలు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. నంగునూరులోని అరుదైన విగ్రహం చుట్టూ రాతిని తొలగించడంతో 11వ శతాబ్దపు ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయని వీటిని కాపాడాలన్నారు. కార్యక్రమంలో అహోబిలం కరుణాకర్‌, పవన్‌, శిల్పి సుధాకర్‌సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

జానపదంతో ఆత్మవిశ్వాసం

- ముగింపు సదస్సులో వక్తలు

సిద్దిపేటఎడ్యుకేషన్‌: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్‌ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో జానపద సాహిత్యం పునఃమూల్యాంకనం అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాల జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ ఆచార్యులు డప్పు కనకయ్య, రిటైర్డ్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ నలిమెల భాస్కర్‌, రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ మాదిరెడ్డి అండమ్మ, పాఠ్యప్రణాళిక అధ్యక్షుడు ఏలె విజయలక్ష్మి, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ అయోధ్యరెడ్డి, సదస్సు కన్వీనర్‌, తెలుగుశాఖాధిపతి డాక్టర్‌ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. జానపదం మానవాళిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. ఇతర భాషల్లోని జానపద అంశాలు, సామెతలు, ఆచార వ్యవహారాలను గురించి విద్యార్థులకు వివరించారు. రెండ్రోజుల సదస్సులో వివిధ కళాశాలలు, యూనివర్సిటీల నుంచి ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, స్నాతక, స్నాతకోత్తర విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలపై 110 పత్రాలను సమర్పించినట్లు తెలుగు అధ్యాపకులు పిట్లదాసు ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల సీఓఈ డాక్టర్‌ గోపాల సుదర్శనం, అధ్యాపకులు డాక్టర్‌ అనురాధ, డాక్టర్‌ ఉమామహేశ్వరి, డా.లీలావతి, డా.ఖలీమొద్దీన్‌, తెలుగు విభాగం అధ్యాపకులు నారోజు వెంకటరమణ, చక్రహరిరమణ, సంపత్‌, రామస్వామి, నరేశ్‌, శైలజ, నర్సింలు, సాయి సురేశ్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కుప్పను ఢీకొట్టిన బైక్‌

యువకుడికి తీవ్ర గాయాలు


గాయాలతో నవీన్‌

రామాయంపేట(మెదక్‌): ధాన్యం కుప్పను బైక్‌ ఢీకొట్టడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఝాన్సి లింగాపూర్‌ గ్రామానికి చెందిన నవీన్‌ మంగళవారం బైక్‌పై ఖాజాపూర్‌ గ్రామానికి వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా గ్రామ శివారులో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాల్‌రాజ్‌ తెలిపారు.

నూతన వంగడాలపై పరిశోధనలు చేయాలి

- లక్నో చెరకు పరిశోధనా కేంద్రం డైరెక్టర్‌ కె.విశ్వనాథ్‌
- ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ఒక రోజు సెమినార్‌

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): అధిక దిగుబడులు వచ్చే నూతన వంగడాలపై పరిశోధనలు చేయాలని లక్నో చెరకు పరిశోధనా కేంద్రం డైరెక్టర్‌ కె.విశ్వనాథ్‌ శాస్త్రవేత్తలను కోరారు. బుధవారం న్యాల్‌కల్‌ మండల పరిధిలోని బసంత్‌పూర్‌–మామిడ్గి గ్రామాల శివారులో గల ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ఒక రోజు సెమినార్‌ నిర్వహించారు. కార్యక్రమానికి శాస్త్రవేత్తలు, వివిధ రాష్ట్రాలకు చెందిన చక్కెర ఫ్యాక్టరీల ప్రతినిధులు హాజరయ్యారు. పరిశోధనా కేంద్రంలోని పలు రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌ మాట్లాడుతూ.. అధిక దిగుబడులు ఇచ్చే కొత్త రకం చెరకు వంగడాలను కనుక్కోవడం ద్వారా అధిక దిగుడులు పొంది రైతులు మంచి లాభాలు పొందవచ్చన్నారు. చెరకు పంట సాగులో దిగుబడులు, చీడ పీడల నివారణ, నీటి యాజమాన్య పద్ధతులు, అంతర పంటల సాగు తదితర అంశాలను గురించి రైతులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని ఆయన కోరారు. శాస్త్రవేత్త డాక్టర్‌ విజయ్‌కుమార్‌ మాట్లాడుతూ.. చెరకు పంట సాగు, దిగుబడులు, చీడ పీడల నివారణ తదితర అంశాలపై రైతులకు ఎప్పటికప్పుడూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం 8005 రకం చెరకు పంటలో కాటిక తెగుళ్లు సోకాయన్నారు. వాటి నివారణ కోసం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్‌ విజయలక్ష్మి, తబసుమ్‌ ఫాతిమా, సంగారెడ్డి సీడీసీ చైర్మన్‌ రాంరెడ్డి, అసిస్టెంట్‌ కేన్‌ కమిషనర్‌ రాజశేఖర్‌, చక్కెర కర్మాగారాల ప్రతినిధులు పాల్గొన్నారు.


సెమినార్‌లో శాస్త్రవేత్తలు, చెరకు పరిశోధనా కేంద్రం డైరెక్టర్‌ విశ్వనాథం, తదితరులు

క్యాన్సర్‌ అంటే భయం వద్దు

- సకాలంలో గుర్తిస్తే ఆదిలోనే జయించే అవకాశం
- మున్సిపల్‌ చైర్మన్‌ మంజుల
- సిద్దిపేటలో 19న ఉచిత వైద్య శిబిరం


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ మంజుల, డాక్టర్లు, నాయకులు

సిద్దిపేటజోన్‌: క్యాన్సర్‌ అంటే ప్రజల్లో ఒక భయం ఉందని, అలా భయపడొద్దని ప్రాథమిక దశలో గుర్తించి సరైన వైద్యం అందిస్తే జయించే అవకాశం ఉందని మున్సిపల్‌ చైర్మన్‌ మంజుల, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్‌ రెడ్డి, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్లు వేణుగోపాల్‌ రెడ్డి, సాయిరాంలు పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కిమ్స్‌ ఆస్పత్రికి చెందిన ప్రముఖ అంకాలజిస్ట్‌ వైద్యులు డాక్టర్‌ మధు, డాక్టర్‌ శ్రవణ్‌ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిద్దిపేట నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే హరీశ్‌ రావు ప్రత్యేక చొరవతో కిమ్స్‌ ఆస్పత్రి సౌజన్యంగా ఉచిత క్యాన్సర్‌ పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 19న స్థానిక విపంచి ఆడిటోరియంలో ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో మమోగ్రఫీ, పాప్‌ స్మియర్‌, బోత్‌బ్రెస్ట్‌ అల్ట్రా సౌండ్‌, ఎక్స్‌రే, ఎండోస్కోపీ, అల్ట్రా సౌండ్‌ తదితర పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం పోస్టర్‌ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఈర్షద్‌, వర్మ, రాములు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ బోల్తా : యువకుడు మృతి


లింగాల భాను(ఫైల్‌)

అక్కన్నపేట(హుస్నాబాద్‌): ట్రాక్టర్‌ బోల్తా పడి యువకుడు మృతి ఘటన అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన లింగాల భాను(23) వ్యవసాయ పనుల నిమిత్తం తన మామయ్య లింగాల యాదయ్య దగ్గర నుంచి ట్రాక్టర్‌ తీసుకెళ్లాడు. పనులు పూర్తి చేసిన అనంతరం తెల్లవారుజామున తీసుకొస్తుండగా గ్రామ శివారులో కల్వర్టు వద్ద ట్రాక్టర్‌ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో భాను ట్రాక్టర్‌ ఇంజన్‌ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. అందరితో కలివిడిగా ఉండే యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బైక్‌ ఢీకొని వ్యక్తి


టేక్మాల్‌ (మెదక్‌): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మతి చెందిన ఘటన టేక్మాల్‌ మండల పరిధిలోని లక్ష్మణ్‌ తండాలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ దయానంద్‌ కథనం మేరకు.. జోగిపేట– లక్ష్మీనగర్‌ రోడ్డుపై 14న తండాకు చెందిన కాట్రోత్‌ పోమ్లా నాయక్‌ (55) వడ్లు ఆరబోస్తుండగా అతివేగంగా బైక్‌ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు అయ్యాయి. 108 సాయంతో మెదక్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు బిక్యానాయక్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైన్స్‌లోని పర్మిట్‌ రూమ్‌లో యువకుడు


యాదుల్‌ (ఫైల్‌)

జోగిపేట(అందోల్‌): వైన్స్‌లోని పర్మిట్‌ రూమ్‌లో యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ పాండు కథనం మేరకు.. జోగిపేట పట్టణానికి చెందిన యాదుల్‌ (45) చౌరస్తాలోని టీ స్టాల్‌లో పనిచేస్తుంటాడు. బుధవారం మద్యం సేవించేందుకు మార్కెట్‌ యార్డు ఎదురుగా ఉన్న పద్మావతి వైన్స్‌కు వెళ్లాడు. అతిగా మద్యం సేవించి కూర్చున్నచోటే కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ అనిల్‌కుమార్‌, ఎస్‌ఐ పాండు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫర్వీన్‌ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వడదెబ్బ లక్షణాలతో వృద్ధుడు?


బాలయ్య (ఫైల్‌)

రామాయంపేట(మెదక్‌): వడదెబ్బ లక్షణాలతో వృద్ధుడు మృతి చెందిన ఘటన రామాయంపేట పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన ఎరుకల బాలయ్య(68) ప్రతిరోజూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు రోజులుగా అస్వస్థతకు గురై పనికి వెళ్లకుండా ఇంటివద్దే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి వాంతులు చేసుకున్న బాలయ్యను ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. తన భర్త వడదెబ్బతోనే మృతి చెందినట్లు మృతుని భార్య తెలిపింది. సమాచారం అందుకుని వైద్యశాఖ అధికారులు మృతుడి ఇంటికెళ్లి వివరాలు సేకరించారు. వడదెబ్బతో మృతి చెందలేదని, అలాంటి లక్షణాలు లేవని పేర్కొన్నారు.

ఉచిత కరెంట్‌తో ఇటుక బట్టీలు

ట్రాన్స్‌కో ఆదాయానికి భారీగా గండి

- వ్యవసాయ బావుల నుంచి అక్రమంగా తీసుకుంటున్న నిర్వాహకులు
- ప్రభుత్వ భూముల్లో నుంచి మట్టి తవ్వకం
- చోద్యం చూస్తున్న అధికారులు


తూప్రాన్‌ మండలంలో ప్రభుత్వ భూమిలో ఇటుక బట్టీ

తూప్రాన్‌: రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కరెంట్‌ అక్రమ ఇటుకల వ్యాపారులకు వరంగా మారింది. పంటల సాగు కోసం వినియోగించాల్సిన ఉచిత విద్యుత్‌ను తమ వ్యాపారానికి వినియోగిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. ఇటుకల తయారీ కోసం అవసరమయ్యే నీటి కోసం విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఓ పక్కా రైతులు వేసిన పంటలకు విద్యుత్‌ సరఫరా సక్రమంగా అందించలేక, లో వోల్టేజీ కారణంగా బోరుమోటార్లు కాలిపోతున్నాయి. ఫలితంగా రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. అక్రమ విద్యుత్‌ కనెక్షన్లను అరికట్టినట్‌లెతై విద్యుత్‌ సరఫరా మారింత మెరుగుపడనుందని పలువురు రైతులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా ట్రాన్స్‌కో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఉమ్మడి మండలంలో 16 బట్టీలు

ఉమ్మడి మండలంలో తూప్రాన్‌, మనోహరాబాద్‌ మండలాల్లో తదితర గ్రామల్లో కొంతమంది ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. నిత్యం లారీలు, ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు సరఫరా తరలిస్తున్నారు. వ్యవసాయ పొలాల్లోని ఉచిత కరెంటు వినియోగిస్తూ జోరుగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో ప్రజలు నూతన ఇళ్ల నిర్మాణాలను అధికంగా చేపడుతున్నారు. దీంతో ఇటుకల అవసరం అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో జోరుగా ఇటుక బట్టీలు వెలుస్తున్నాయి. సుమారు ఉమ్మడి మండలంలో 16 బట్టీలకు పైగా మండలంలో కొనసాగుతున్నాయి. వీటికి నిర్వాహకులు ఉచిత కరెంట్‌ను వినియోగిస్తున్నారు. బావుల దగ్గర నడవని మోటార్ల నుంచి కరెంట్‌ తీసుకొని వాడుకుంటున్నారు.వ్యాపారులు ఇటుక బట్టీలకు తప్పనిసరిగా కమర్షియల్‌ విద్యుత్‌ కనెక్షన్‌ తీసుకోవాలి. కానీ ఎలాంటిది ఏదీ తీసుకోవడం లేదు. దీంతో రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ విషయం ట్రాన్స్‌కో అధికారులకు తెలిసినా నామ మాత్రంగా కేసులు పెట్టి చేతులు దులుపుకుంటూ... పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకం

ఇటుకల తయారీకి అవసరమైన మట్టిని ప్రభుత్వ భూముల్లోంచి లారీలు, ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారు జామువరకు ముడి సరుకును గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఇలా ప్రభుత్వ భూముల్లో, చెరువులు, కుంటలు ఎక్కడబడితే అక్కడ వీరి అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట లేకుండా పోతుంది. ఇప్పటికైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై దృష్టి సారించి వ్యాపారులను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఇటుక బట్టీలకు ఉచిత విద్యుత్‌ను వినియోగిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొందరిపై కేసులు నమోదు చేశాం. వ్యాపారులు ఇటుక బట్టీలకు తప్పనిసరిగా కమర్షియల్‌ విద్యుత్‌ కనెక్షన్‌ తీసుకోవాలి. లేని పక్షంలో వారిని గుర్తించి చట్టరీత్యా కేసులు నమోదు చేస్తాం.
– వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఏఈ, తూప్రాన్‌